క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ

ఏలూరు (టూటౌన్) : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీ సూర్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు కొమ్మన నాగ చరణ్ తేజ, చిట్టూరి కార్తికేయలు 591 మార్కులతో స్కూల్ ఫస్ట్ సాధించారని పాఠశాల డైరెక్టర్ కొండపల్లి చంద్రశేఖరరావు తెలిపారు. వీరిని గురువారం డీఈఓ ఎం వెంకటలక్ష్మమ్మ అభినందించారు. 580 మార్కులతో సీహెచ్ సాయి అమృత లక్ష్మి ద్వితీయ, 579 మార్కులతో లక్ష్మీ యశస్విని తృతీయ స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను కొండపల్లి అభినందించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి చర్యలు

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కృషి చేస్తానని పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) తెలిపారు. తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు నియోజకవర్గంలో పార్టీ పటిష్టానికి చేపడుతున్న చర్యలు, నూతన కమిటీల నియామకాలు, ఇతర అంశాలపై జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించామని జేపీ వివరించారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా పనిచేస్తామని తెలిపారు.

రామకృష్ణాపురంలో అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ఓం శ్రీ సాయిరాం భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 14వ ఆరాధన మహోత్సవం సందర్భంగా ఏలూరు రామకృష్ణాపురం శ్రీ సత్యసాయి మందిరం వద్ద తెల్లవారు జమున నగర సంకీర్తన, కలువలపల్లి రాంబాబు శర్మ బృందం వారిచే నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి గాయత్రి హోమం, వెయ్యి మందికి అన్న ప్రసాదం నారాయణ సేవ చేశారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ పైడేటి రామారావు, ఏలూరు జిల్లా సేవా కోఆర్డినేటర్ జి.వెంకటేశ్వరరావు, ఈశ్వర్ లాల్, రామనాథ బాబు, మల్లికార్జునరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆశ'లను ఉద్యోగులుగా గుర్తించండి

ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు పోసమ్మ



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు పోసమ్మ



సదస్సులో పాల్గొన్న ఆశ కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): ఆశ కార్యకర్తలను ఉద్యోగులుగా గుర్తించాలని, నేషనల్ హెల్త్ మిషన్‌కు నిధులు కేటాయింపులు పెంచాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు కె.పోసమ్మ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల వ్యవస్థ ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆశ వర్కర్ల జిల్లా సదస్సు గురువారం స్థానిక సీతారాం భర్తీయా కల్యాణ మండపంలో పి.కమల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పోసమ్మ మాట్లాడుతూ గత 20 ఏళ్లగా ఆశ కార్యకర్తలు నిబద్ధతతో సేవలు అందిస్తున్నారని వివరించారు. జాతీయ ఆరోగ్య పథకానికి నిధులు పెంచాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి ,గ్రాడ్యుటీ, ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ, పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్వీడీ ప్రసాద్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోర్సు తీసుకొచ్చి కార్మికులను బానిసలుగా మార్చే చర్యలకు పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికు,లు ఉద్యోగులు ఐక్యంగా మే 20న దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆశ కార్యకర్తలు ఎన్నో పోరాటాల ఫలితంగా రూ.50 జీతం నుంచి రూ.10,000కు పెంచుకున్నారని వివరించారు. రాజకీయ వేధింపుల గురికాకుండా తమను తామ రక్షించుకున్నారని పోరాటం ద్వారా సాధ్యమైందన్నారు. తొలుత ఆశ యూనియన్ అఖిలభారత వ్యవస్థాపక అధ్యక్షురాలుగా చేసి మరణించిన రంజనా నీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు విమల, స్కూల్ స్వీపర్ యూనియన్ జిల్లా నాయకురాలు కె.విజయలక్ష్మి, ఆశ యూనియన్ జిల్లా నాయకులు లోకేశ్వరి, నవ్య, కామేశ్వరి, నాగ దుర్గ, విజయలక్ష్మి, ధనలక్ష్మి, పుల్లమ్మ, పావని, పార్వతి, సునీత, సీనియర్ ఆశా కార్యకర్త చిట్టెమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాగమణి కుటుంబాన్ని ఆదుకోవాలి



డ్వామా ఏఓ రఘురామ్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఉపాధి హామీ పనిచేస్తూ పని ప్రదేశంలో చనిపోయిన కొరపాటి నాగమణి కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం ఆధ్వర్యంలో జిల్లా డ్వామా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏఓ రఘురామ్‌కు వినతి పత్రం అందజేశారు. పని ప్రదేశాల్లో చనిపోతున్న ఉపాధి హామీ కూలీల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం నిడమర్రు మండలం పెదనింద్రకొలను గ్రామంలో కూరపాటి నాగమణి (48) అనే దళిత మహిళ పనిచేస్తూ బోదిలో పడి చనిపోయిందని తెలిపారు. నాగమణి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని, చదువుకున్న పిల్లలకు ఎన్ఆర్ఈజీఎస్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. నాగమణి కుటుంబానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ తరఫున ప్రగాఢ సానుభూతి, ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్ రాజశేఖర్, ఎం సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి కుర్చీల వితరణ



హెల్త్ సెంటర్‌కు కుర్చీలను అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఏలూరు (టూటౌన్) : రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ ఏలూరు యూనిట్ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక చాణిక్యపురి ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు రూ.6000 వేలు విలువైన 10 కుర్చీలను డాక్టర్ ఎస్ మానసకు అందజేశారు. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల రిటైర్డ్ తెలుగు శాఖాధ్యక్షురాలు షేక్ రహిమాన్ జ్ఞాపకార్థం ఆమె భర్త, యూనిట్ అధ్యక్షుడు షేక్ హుస్సేన్ ఆర్థిక సాయంతో ఈ సాయం అందించారు. కోటదిబ్బలోని సబ్ ట్రెజరీ ఆఫీసుకు రూ.5500 విలువైన 10 కుర్చీలను అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ జి.సత్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌సీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షురాలు జి.లలిత, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎన్‌వీవీఎస్ ప్రసాద్, కె.శ్రీకాంత్, సబ్ ట్రెజరీ ఆఫీసర్ ఎం స్వరాజ్య మణి, ట్రెజరీ సిబ్బంది, శాణిక్యపురి కాలనీ అసోసియేషన్ సభ్యులు పి.రాజారావు, వి.సుబ్రహ్మణ్యం, ఎ.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఏలూరు (టూటౌన్): టీడీపీ కూటమి ప్రభుత్వ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అశోక్ నగర్‌లోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లా అధ్యక్షుడు యర్రా రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ రమణారావు మాట్లాడారు. కార్మికులు సంక్షేమ పథకాలు అమలుకు ఆటంకంగా ఉన్న 14 12 మెమో రద్దుచేసి, సంక్షేమ బోర్డు పథకాల అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్ వీడీ ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులు సంక్షేమ బోర్డులో నిధులు కార్మికులు కుటుంబాలకు మాత్రమే ఖర్చు చేయాలని, పెండింగ్ క్లైములను పరిష్కరించాలని కోరారు. అనంతరం డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. తొలుత భవన నిర్మాణ కార్మికులు ప్రదర్శన చేశారు. ధర్నాలో అయినపర్తి మాధవ, సీహెచ్ కొండలరావు, షేక్ అబ్దుల్, అక్బర్, చీర అప్పారావు, పరస రాజేష్, కానా, సాంబశివరావు, బత్తుల బుజ్జి, తాడి సత్యనారాయణ తదితరులు మాట్లాడారు.

యంత్రాలతో వరి కోతలు



మెట్టలో వరి పంట కోస్తున్న యంత్రం

చింతలపూడి : మెట్ట ప్రాంతంలో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం సబ్ డివిజన్ పరిధిలో 8,228 ఎకరాల్లో వరి సాగు చేశారు. వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. కొన్ని గ్రామాల్లో కూలీల కొరతతో వరికోత యంత్రాలపై రైతులు ఆధార పడుతున్నారు. వరి కోతకు మెషీన్‌కు గంటకు రూ.2,000 నుంచి రూ.3,000 వరకు చెల్లిస్తున్నారు. కూలీలతో వరి కోసి ధాన్యం ఆరాక కుప్పలు వేసి, నూర్పిడి చేసేవారు. యంత్రాలతో ఒకేసారి కోతతోపాటు ధాన్యం ఒబ్బిడి అవుతుండడంతో యంత్రాలతో మాసూలుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వరి కోత యంత్రాలకు డిమాండ్ పెరిగింది.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. రైతులు దళారులను నమ్మి నష్టపోకుండా ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు సేకరించాలి. రైతులకు అన్ని రకాలుగా సహకారం అందించాలి.

– గద్దమడుగుల రాజేష్ నాయుడు, రైతు, చింతలపూడి

టార్పాలిన్లు పంపిణీ చేయాలి



చింతలపూడిలో ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి. రబీ పంట మాసూళ్లు ప్రారంభమయ్యాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేక పోవడంతో వ్యవసాయశాఖ ద్వారా రైతులకు ఉచితంగా టార్పాలిన్లు పంపిణీ చేయాలి.

– టి.బాబు, సీపీఐ మండల కార్యదర్శి, చింతలపూడి

ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి



పోలవరం రూరల్ : మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు



కొయ్యలగూడెం : ప్రకృతి వ్యవసాయ రైతులను సత్కరించిన వ్యవసాయాధికారులు

పోలవరం రూరల్ : రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు సూచించారు. పోలవరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నవధాన్యాలు, ప్రకృతి వ్యవసాయానికి జీవామృతం, పంచగవ్య వాడకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల మానవుని జీవన ప్రమాణం పెరుగుతుందన్నారు. ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించడంతో పాటు ప్రకృతి వ్యవసాయం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి రైతులకు విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు, కరిబండి నాగరాజు, కె.ప్రసాద్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడి హేయమైన చర్య

భీమడోలు: ఉగ్రదాడిని ఖండిస్తూ గురువారం రాత్రి భీమడోలులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో గణపతి సెంటర్ నుంచి భీమడోలు సంతమార్కెట్ వరకు కొవ్వొత్తులు పట్టుకొని నిరసన ర్యాలీ చేశారు. ఉగ్రవాదం నశించాలని కోరుతూ నినదించారు. ప్లేకార్డులను పట్టుకుని ప్రదర్శన చేశారు. సంతమార్కెట్ వద్ద మానవ హారం చేశారు. మృతి చెందిన వారికి సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

నిడమర్రు: జమ్మూ కాశ్మీర్లో బైసరన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి చేసి 28 మందిని హతమార్చడాన్ని ఖండిస్తూ గురువారం రాత్రి నిడమర్రు మండలం వాసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని మృతుల కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలకు దేశ పౌరులంతా ఏకతాటిపైకి వచ్చి సంఘీభావం తెలిపాలన్నారు. ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మొక్కలే మానవ మనుగడకు జీవనాధారం

పెదవేగి: మొక్కలు మానవ మనుగడకు జీవనాధారం అని సెయింట్ జోసెఫ్ దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలోని సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో అంతర్జాతీయ మ్యాక్సిలో ఫేషియల్ రేడియాలజీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ విభాగం హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఎం శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ మోజెస్ ఆధ్వర్యంలో ఆయా విభాగాల్లో కళాశాలల్లోని ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మృదుల, డాక్టర్ స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యులకు సన్మానం



ఎంపీటీసీలను సన్మానించిన అధికారులు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కేఆర్ఎస్ కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులను సన్మానించారు. వైస్ ఎంపీపీ నరెడ్ల వెంకట సుబ్బారావు పంచాయతీ రాజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థల పనితీరు, విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సారా నిందితుల అరెస్ట్

కామవరపుకోట: మండలంలో కొండగూడెం శివారులో నిర్వహించిన దాడుల్లో గ్రామానికి చెందిన చీకట్ల రమేష్ నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. రమేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని, అతడికి బెల్లపు ఊట సరఫరా చేసిన జూలూరి కిరణ్‌పై పరారీలో ఉన్నట్టు చెప్పారు. సారా పాత కేసులో నిందితులు చెందిన జువ్వాల సత్యవతి (జలపవారి గూడెం), రాజులపాటి దుర్గారావు (వెంకటాపురం), మిరియాల శరత్ కుమార్ (ఆడమిల్లి), రాచప్రోలు మల్లికార్జునరావు (కొత్తగూడెం)లను చింతలపూడి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్టు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	22	చిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	30	బీన్సచిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	--	చామదుంపలు	54
బెండకాయలు	26	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	76
కాకర కాయలు	32	బీట్‌రూట్	30
బీరకాయలు	30-34	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	36	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	30-34	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	36
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	24
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	31
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

వికలాంగుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు

ఏలూరు (టూటౌన్): జిల్లా పరిషత్ / మున్సిపల్ ప్రభుత్వ పాఠశాలలో చదివిన విభిన్న ప్రతిభావంతుల (వికలాంగుల) పిల్లలకు విద్యా ప్రతిభా పురస్కారం-2025 అందజేయనున్నట్టు విసాస్ ఏపీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు అల్లాడి నటరాజు తెలిపారు. శారీరకం, అంధత్వం, చెవిటి - మూగ తదితర వైకల్యాలు గల వ్యక్తుల్లో 10వ తరగతి (2025)లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో ప్రథమ శ్రేణిలో పాసైన విసాస్ ఏపీకి దరఖాస్తు చేసుకున్న అత్యధిక మార్కులు సాధించిన వారికి రూ.5000, రూ.3000, రూ.2000 నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందజేస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న విభిన్న ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవచ్చునని నటరాజు తెలిపారు.

డీఈఎల్ఈడీ పరీక్షకు 45 మంది హాజరు

ఏలూరు (టూటౌన్): డీఈఎల్ఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలకు 47 మంది విద్యార్థులకు 46 మంది హాజరైనట్టు డీఈఓ ఎం వెంకటలక్ష్మమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకరు గైర్హాజరు కావడంతో 97.83 శాతం హాజరు శాతం నమోదైనట్టు పేర్కొన్నారు. మొదటి సెమిస్టర్ పరీక్షలకు 92 మందికి 88 మంది విద్యార్థులు హాజరయ్యారని, 95.65 శాతం హాజరు నమోదైందని తెలిపారు.

గరుడ వాహనంపై శ్రీనివాసుడు



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి శ్రీనివాసునికి గరుడోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. కల్యాణం నిర్వహించిన మరుసటి రోజు రాత్రి ఈ వేడుక నిర్వహించడం సాంప్రదాయంగా వస్తోంది. ఉభయ దేవేరులతో స్వామి వారిని గరుడ వాహనంలో ఊరేగించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ నిర్వహించారు.

రైతులకు సన్మానం

కొయ్యలగూడెం: యర్రంపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సదస్సు నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి సంజీవరావు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విధానాలు నవధాన్యాలు, పచ్చిరొట్ట పెంపకం ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయాన్ని చేస్తూ ఆదర్శంగా నిలిచిన రైతులు ముల్లపూడి వెంకట సుబ్బారావు, శ్రీనివాసరావు, నరేంద్ర, రమేష్‌లను సన్మానించారు. రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుజాత, రవి, పాపారావు, సావిత్రి జ్యోతి, సత్యనారాయణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధితోనే గ్రామ స్వరాజ్యం

చింతలపూడి: పల్లెలు అభివృద్ధి సాధించిన నాడే గ్రామ స్వరాజ్యం సాధ్యమని ఎంపీడీఓ మురళీ కృష్ణ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రగడవరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీఎం రత్నకుమార్, డి.శ్యామలరావు, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

భీమడోలు: ప్రతి ఏటా వేసవిలో బాటచారులు, భక్తుల దాహార్తిని తీర్చుతున్న వైఎస్సార్ సీపీ వీరాభిమాని రేవాడ శ్రీనివాసరావు సేవలు ఆదర్శప్రాయమని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు రాష్ట్రీయ రహదారిపై గురువారం వైఎస్సార్ సీపీ వీరాభిమాని రేవాడ శ్రీనివాసరావు దివంగత సీఎం వైఎస్సార్ పేరుతో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ప్రతి వేసవిలో ప్రజలందరి దాహార్తిని తీర్చేందుకు రేవాడ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు పేదరికాన్ని అనుభవిస్తూ కష్టించి సంపాదించుకున్న మొత్తాన్ని సామాజిక సేవలకు వినియోగించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ ఆళ్ల శ్రీనివాస్, నియోజకవర్గ నాయకులు పసుపులేటి సత్యనారాయణ, రామిశెట్టి శ్రీను, సొసైటీ మాజీ డైరెక్టర్ కిలపర్తి భాస్కరరావు, పోలసానిపల్లి మాజీ ఉపసర్పంచ్ అంబటి నాగేంద్రప్రసాద్, నాయకులు మంగి గోవింద రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.